క్లుప్తంగా

ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానిస్తున్న అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను అధికారులు సన్మానించారు. సంస్థలో ఈఈగా తాతాజీ, పరిపాలనాధికారిగా దుర్గాప్రసాద్, అర్జునరావు శుక్రవారం రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ సమావేశ మందిరంలో ఉద్యోగ విమరణ చేసిన వారికి శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల పాటు పలు హోదాల్లో అంకిత భావంతో పని చేస్తూ అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులందరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, సీయూపీ శిల్ప, సీఈ భవానీ శంకర్, సీఏవో హరిప్రసాద్, ఎస్టేట్ అధికారి దయానిధి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా శాంతి యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్విక్కులు

ఏయూక్యాంపస్: లోక కల్యాణం కాంక్షిస్తూ బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో శ్రీ వాసవీ మహా శాంతి యాగం నిర్వహించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా వి201ఎ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, రుత్విక్కుల వేదమంత్రాలతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కృష్ణ శర్మ బృందం విఘ్నేశ్వర పూజ, కుంకుమార్చన ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ కోశాధికారి సి.కృష్ణ, వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ టి.అమర్నాథ్, ప్రవచనకర్త రామకృష్ణారావు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ బి.వి సావిత్రి, ఎం.వి. రాజశేఖర్, పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌పై అవగాహన

విశాఖ విద్య: వన్ ఇండియా–డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ నందు రెండు వారాల పాటు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఆచార్య స్టీఫెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 14 వరకు ఇది జరుగుతుందన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చి స్పాన్సర్‌తో డిజిటల్ సాధనపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సామాజిక, ఆర్థిక అంశాల్లో డిజిటల్ సాధనల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు తోడ్పాటు అందించేలా ఈ ప్రోగ్రామ్‌కు రూపకల్పన చేశామన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న.. వీధి కుక్కలు





గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శునకాల స్వైర విహారం అధికమైంది. విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై మూకుమ్మడిగా దాడికి పాల్పడుతున్నాయి. దీంతో రోడ్ల పైకి రావాలంటేనే చిన్నపిల్లలు, వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జేఆర్ నగర్‌కాలనీ, పాత వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లోని వీధుల్లో శునకాలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో కాలనీవాసులు ఇళ్ల నుండి బయటికి రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. దీనిని బట్టి ప్రజలపై కుక్కలు చేస్తున్న దాడుల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల ఉత్పత్తిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని, కుక్కల దాడుల నుండి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నియంత్రణ లేక అనర్థాలు..

నియంత్రణ లేకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వార్డులో పలు ప్రాంతంలోని వీధుల్లో అన్ని వేళల్లో శునకాలు తిరుగుతున్నాయని చెబుతున్నారు. వీధి కుక్కలను గుర్తించి వాటిని డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతున్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయించాలని చెబుతున్నారు. కుక్క కాటు వల్ల ఇబ్బంది లేకుండా ఉండేందుకు ర్యాబిస్ వ్యాక్సిన్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం

మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి..

పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు బయటికి వెళ్లినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. నడిచి వెళ్లే వారితో పాటు వాహనాలపై వెళ్లే వారిని కూడా వదలడంలేదు. వెంబడించి మీద పడుతున్నాయి. దీంతో వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు లోనై గాయాలపాలవుతున్నారు.

– దాడి రామారావు, పాత వెంకోజీపాలెం

భయమేస్తోంది..

మా ఏరియాలో వీధి కుక్కలు ఎక్కువైపోయాయి. వాటిని చూస్తే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. రాత్రివేళ మరింత ఇబ్బందిగా ఉంది. ఎక్కడికైనా వెళ్లి వచ్చేటప్పుడు కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల సమస్య పరిష్కరించాలి.

– ఎం.ఎన్.మూర్తి, జేఆర్ నగర్

నిబంధనలు పాటించకపోతే గుర్తింపు కార్డుల రద్దు



రైతులతో మాట్లాడుతున్న యాసిన్



ఎంవీపీ రైతు బజార్‌లో సబ్జీ కూలర్‌ను ప్రారంభిస్తున్న మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

ఆరిలోవ: రైతు బజార్లలో వ్యాపారులు, డ్వాక్రా మహిళలు, రైతులు నిబంధనలు పాటించకపోతే గుర్తింపు కార్డులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ హెచ్చరించారు. ఎంవీపీ రైతు బాజర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ స్టాల్లు, వాటి వద్ద కాయగూరల ధరల బోర్డులను పరిశీలించారు. అనంతరం రైతుల వద్ద రోజులో విక్రయించగా మిగిలిన కూరగాయలు పాడవకుండా భద్రపరుచుకోవడానికి అందుబాటులోకి తీసుకువచ్చిన సబ్జీ కూలర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులు, వ్యాపారులు, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. సబ్జీ కూలర్‌ను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలలోపు ఎవరూ బయటి వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులకు ఎక్కువ మొత్తంలో కాయగూరలు విక్రయించకూడదని తెలిపారు. అలాంటి వారిపై వినియోదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా, రైతు బజార్ సిబ్బంది గుర్తించినా గుర్తింపు కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు జి.కనక రాజు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దయాల్‌బాగ్ వస్త్ర ప్రదర్శనకు చక్కటి స్పందన



డిప్లొమో విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్



దయాల్‌బాగ్ ఎగ్జిబిషన్‌లో సందడి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. దయాల్‌బాగ్ విద్యా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను సంస్థల జిల్లా కార్యదర్శి కె.మురళీధరరావు ప్రారంభించారు. ఇక్కడ ఇనిస్టిట్యూట్‌లో చేతివృత్తుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, గతంలో శిక్షణ పొందిన విద్యార్థులు తయారు చేసిన చీరలు, ఫ్రాక్స్, నైటీలు, టాప్‌లు, పిల్లో కవర్లు, బెడ్‌షీట్లు, పైజామాలు, కుర్తాలు, షరాయిలను ప్రదర్శించారు. వీటితో పాటు ఇక్కడ డిప్లొమో విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ ప్రాజెక్టు, ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలు ప్రదర్శించారు. విశాలాక్షినగర్, ఎంవీపీకాలనీ, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల నుంచి వినియోగదారు వస్త్రాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సంస్థల జిల్లా కార్యదర్శి కె.మురళీధరరావు మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి తయారు చేసిన వస్తువులను విక్రయించే విధంగా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు రూ.2 లక్షలు విలువ చేసే వస్తువులు ప్రదర్శనకు పెట్టినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వస్త్రాలు నాణ్యమైనవి కావడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. కార్యక్రమంలో డీఈఐ నిర్వాహకులు దక్షణమూర్తి, డాక్టర్ రాజేష్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతను దర్శించుకున్న పైడా, కంకటాల



వాసవీ అమ్మవారిని దర్శించుకుంటున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్

విశాఖ సిటీ: శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ అమ్మవారిని పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఈ ఏడాది నుంచి రాష్ట్ర పండగగా నిర్ణయించడం గొప్ప విషయమని పైడా, కంకటాల పేర్కొన్నారు. తిరుపతి, విజయవాడ, అన్నవరం, సింహాచలం వంటి ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనుండడం వైశ్యులందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రమేష్ కుమార్ (ఫైల్)

ఆరిలోవ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురవాడకు చెందిన వి.రమేష్ కుమార్ (31) దాబాగార్డెన్స్‌లో పువ్వుల దుకాణంలో పని చేస్తున్నాడు. డిసెంబరు 27న షాపు నుంచి రాత్రి 9.30 గంటలకు ద్విచక్ర వాహనంపై మధురవాడ వెళ్తుండగా హనుమంతవాక వద్ద ఆరిలోవ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసులో పోలీసులు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. దీంతో రమేష్ తన పువ్వుల షాపు యజమాని ద్వారా తన అన్నయ్య మురళీకృష్ణకు సమాచారం అందించాడు. మురళీకృష్ణ వచ్చి చూడగా ఎక్కడా రమేష్ జాడ కనిపించలేదు. హనుమంతవాక వచ్చి చూసినా ఫలితం లేకపోయింది. ఇంటికి కూడా చేరలేదు. స్నేహితులు, బంధువులను సంప్రదించినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. రమేష్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ప్రపంచ జీబ్రా దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు



సంతపాలెం పాఠశాల విద్యార్థులు వేసిన చిత్రాలతో ఉపాధ్యాయులు, పిల్లలు



జూలో నిర్వహించిన పోటీలలో తాము గీసిన చిత్రాలతో పిల్లలు

ఆరిలోవ: ప్రపంచ జీబ్రా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందిరాగాంధీ జూ పార్కులో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన పిల్లలకు జూ పార్కు బయోస్కోప్‌లో జీబ్రాలపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు కూడా ఈ పోటీలు నిర్వహించారు. బయట పాఠశాలల్లో భాగంగా ఆరిలోవ ప్రాంతం పెదగదిలి వద్ద సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు, జూ సిబ్బంది ఆధ్వర్యంలో జీబ్రాలపై ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ జీబ్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జూలో రాజా అనే ఒక జీబ్రా ఉన్నట్లు తెలిపారు. దాన్ని దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జూ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం ఆటోమోటివ్ కూడలి సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎంవీపీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో వ్యభిచార గృహం నిర్వాహకుడు సంజీవి సంతోష్‌కుమార్ (37)తో పాటు విటుడు రోహిణి కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ సీఐ మురళీవెల్లడించారు.

స్పీకర్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు

ఎంవీపీకాలనీ: స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం విఘాతంగా ఉందంటూ ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలను సంఘం నాయకులు తప్పుబట్టారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో పలు గిరిజన సంఘాలతో శుక్రవారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో రౌంటే బుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ 1/70 చట్టం గిరిజనులకు రక్షణగా ఉందన్నారు. దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాలు, సంపదను కాపాడటంలో ఈ చట్టం పాత్ర కీలకమన్నారు. ఇలాంటి చట్టాన్ని తొలగించడమో, సవరించడమో చేస్తే ఏజెన్సీ ప్రాంతాలతో పాటు గిరిజనుల రక్షణ ప్రశ్నార్థమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. 1/70 చట్టం రద్దు నిర్ణయంతో గిరిజన సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల సీనియర్ నాయకులు కిముడు రామారావు, బాకా సత్యారావు, ఓలేసి రామలింగం, ఉద్యోగుల సంఘం కార్యవర్గ సభ్యులు ఎం.ప్రసాద్, కె.ప్రసాద్, ఎస్.శోభన్, ఎస్.బాలగంగాధర్ తిలక్, తౌడయ్య, రమణమూర్తి, కోటేశ్వరరావు, కిల్లో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుడి బంధువుల ఆందోళన



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద మృతుడి బంధువులు

ఆరిలోవ: హెల్త్‌సిటీ ఎంబీ ఆస్పత్రిలో సర్జరీ జరిగిన అనంతరం మృతి చెందిన వ్యక్తి బంధువులతో శుక్రవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద హడావిడి చోటు చేసుకుంది. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన డి.కృష్ణ (35) ఇటీవల కిడ్నీలో రాళ్ల సమస్యతో ఆస్పత్రిలో చేరాడు. ఇక్కడ వైద్యులు ఈనెల 28న కిడ్నీలో రాళ్లు తొలగించడానికి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ జరిగిన అనంతరం రోగి పరిస్థితి విషయమించడానికి సర్జరీ చేసిన వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో 29న నగరంలోని ఆయుష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణ మృతి చెందినట్లు ఆయుష్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వెల్లడించారని బంధువులు తెలిపారు. ఆయన మృతికి ఎంబీ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి స్వగ్రామం నుంచి అధిక సంఖ్యలో గ్రామస్తులు, బంధువులు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కృష్ణ కుటుంబానికి న్యాయం జరగేలా చూడాలని పోలీసులను కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఏయూకు ఐఓఈ హోదా కోసం కృషి



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ప్రతిష్ఠాత్మకమైన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్(ఐఓఈ) స్థానానికి పోటీ పడేందుకు కృషి చేస్తున్నట్లు ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శశిభూషణరావు తెలిపారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) నుంచి ప్రొఫెసర్ శివప్రసాద్ శుక్రవారం ఏయూను సందర్శించి వర్సిటీ అధికారులతో సమావేశమయ్యారు. జాతీయ విద్యా విధానం అమలుతో పాటు, పలు కీలక విషయాలపై చర్చించారు. ఐఓఈ హోదా సాధించటం ద్వారా దేశంలో అగ్రశ్రేణి సంస్థల లీగ్‌లోకి ఆంధ్ర యూనివర్సిటీని తీసుకెళ్తామన్నారు. ఎన్ఈపీకి అనుగుణంగా ఫిబ్రవరి 22న ఏయూలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ రావు తెలిపారు.

ముగిసిన పశు వైద్య శిబిరాలు



తునివలసలో దూడకు వ్యాక్సిన్ వేస్తున్న జేడీ డాక్టర్ రామకృష్ణ

ఆరిలోవ: జిల్లా పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు శుక్రవారంతో ఉగిశాయి. ఈ శిబిరాలు డిసెంబర్ 20న ప్రారంభించిన విషయం తెలిసిందే. పన్నెండు రోజుల పాటు జరిగిన ఈ శిబిరాలలో వైద్యులు వేల సంఖ్యలో పశువులకు టీకాలు, వ్యాధి నిరోధక మందులు అందజేశారు. జిల్లాలో 164 ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఆయా శిబిరాలలో పశువులకు సాధారణ చికిత్సలు, శస్త్ర చికిత్సలు, గర్భకోశ చికిత్సలు చేయడంతో పాటు నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. పాడి రైతులు, కోళ్ల తదితర జీవాల పెంపకందార్లకు ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో 4,602 మంది రైతులకు చెందిన ఆవులు, గేదెలు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలకు, 12,222 ఆవులు, గేదెలకు వైద్యం అందించామన్నారు. వైద్య సేవలు అందించిన డీడీలు, ఏడీలు, వైద్యులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్య శాఖ డీడీ డాక్టర్ చంద్రశేఖర్

ఆరిలోవ: జంతు సంరక్షణపై పౌరులు బాధ్యతగా మెలగాలని జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిలోవ ప్రాంతం భారతీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు జంతువుల సంరక్షణ, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీ పాల్గొని విద్యార్థులకు పశువులు, వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. మూగజీవాల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతపై వివరించారు. మూగజీవాల సంరక్షణ అందరూ బాధ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు. విద్యార్థి దశ నుంచి పెంపుడు జంతువులు, వన్యప్రాణుల ఆవశ్యకత గురించి తెలుసుకోవాలన్నారు. పర్యావరణంలో మూగజీవాలు సమపాళ్లలో ఉన్నప్పుడే మానవుల మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రసాదరావు, పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి.రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమసదన్ ప్రారంభం



ప్రేమసదన్‌ను ప్రారంభిస్తున్న రత్నాకర్ తదితరులు



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పునరుద్ధరించిన శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–8లో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఆర్.హిమవాహిని రత్నాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మందిరాన్ని ప్రారంభించారు. తొలుత వారికి శ్రీ సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు శ్లోకాల పఠనంతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా 40 సంవత్సరాల అంకిత సేవలను స్మరించుకుంటూ ప్రేమసదన్ మందిర్ శిలాఫలకాన్ని, శ్రీ సత్యసాయి బాబా సింహాసనాశనంతో కూడిన చిత్రాన్ని ఆవిష్కరించారు. తర్వాత శ్రీ సత్యసాయి నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో పాటు 54 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు, జ్యూట్ బ్యాగ్ తయారీ కిట్లు, బ్యూటీషియన్ కిట్లు, సబ్బులు, ఎంబ్రాయిడరీ తదితర కిట్లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రత్నాకర్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దైవ స్వరూపమన్నారు. వయస్సు నిమిత్తం లేకుండా ఆయన ఎల్లవేళలా ప్రజలను సేవా మార్గం వూపు నడిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఎస్.కోటేశ్వరరావు, ఎస్‌జీ చలం, ఆర్.లక్ష్మణరావు, పీఆర్ఎస్ఎన్ నాయుడు, డీవీవీ సీతారామ రాజు, శ్రీ సత్యసాయి బాబా భక్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తీరం.. పరిశుభ్రం



అప్పుఘర్ బీచ్‌లో శుక్రవారం వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు బీచ్ క్లీనింగ్ చేశారు. తీరంలోని చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం